## అమెరికా అనుమతి కోసం ఎదురుచూడం

- ఇరాన్ అణు స్థావరాలన్నీ ధ్వంసం చేస్తాం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 20: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమతో చేతులు కలిపినా కలపకున్నా ఇరాన్‌లోని అణు స్థావరాలన్నిటినీ ధ్వంసం చేసే సామర్థ్యం తమ దేశానికి ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం ప్రకటించారు. ఫోర్డోలోని భూగర్భ అణు స్థావరంతో సహా ఇరానియన్ స్థావరాలపై దాడి చేసే ముందు అమెరికా నుంచి అనుమతి కోసం ఎదురు చూడబోమని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో తమ చేరికపై అమెరికా నుంచి ఇంకా స్పష్టమైన నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నెతన్యాహు తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. "మా లక్ష్యాలన్నిటినీ సాధిస్తాం. ఇరాన్‌లోని అన్ని అణు స్థావరాలపై దాడి చేస్తాం. అందుకు అవసరమైన సత్తా మాకు ఉంది" అని నెతన్యాహు తెలిపారు.

## ఈయూతో ఇరాన్ చర్చలు

**అమెరికాతో చర్చలు జరపబోమని వెల్లడి**

జెనీవా, జూన్ 20: తమ దేశం నిర్వహిస్తున్న అణు కార్యక్రమాలపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో యూరోపియన్ దౌత్యవేత్తలతో చర్చలు జరిపేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి శుక్రవారం జెనీవా చేరుకున్నారు. ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ విదేశాంగ మంత్రులు, యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం అధిపతితో ఆయన జెనీవాలోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత పశ్చిమ దేశాలు, ఇరాన్ విదేశాంగ మంత్రుల మధ్య ముఖాముఖీ చర్చలు జరగడం ఇదే మొదటిసారి. సమావేశానికి ముందు అరగ్చి ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగినంత కాలం అమెరికాతో చర్చించడానికి ఏమీ లేదని వ్యాఖ్యానించారు.

## ఇరాన్‌కు మద్దతిస్తే హిజ్బొల్లాకూ అదే గతి

**ఇజ్రాయెల్ హెచ్చరిక**

న్యూఢిల్లీ: ప్రస్తుతం ఇజ్రాయెల్‌తో సాగుతున్న ఘర్షణలలో ఇరాన్‌కు అండగా ఉంటామంటూ హిజ్బొల్లా చేసిన ప్రకటనను ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ శుక్రవారం తీవ్రంగా వ్యతిరేకించారు. తమ దేశాన్ని బెదిరిస్తున్న ఉగ్రవాదుల పట్ల సహనం కోల్పోయామని, వారికి తగిన విధంగా బుద్ధి చెబుతామని ఆయన తెలిపారు. హిజ్బొల్లా ప్రధాన కార్యదర్శి తన పూర్వ నాయకుల నుంచి గుణపాఠం నేర్చుకోవడం లేదని, ఇరాన్ నియంత ఆదేశాల మేరకు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా హెచ్చరికలు చేస్తున్నారని ఎక్స్ వేదికగా కట్జ్ పేర్కొన్నారు. తనను హెచ్చరించే ఉగ్రవాదుల పట్ల ఇజ్రాయెల్‌కి సహనం నశించిందని, హిజ్బొల్లా చీఫ్ అర్థం చేసుకుని జాగ్రత్తగా ఉండాలని, ఉగ్రవాదం ఉన్నపక్షంలో ఇక హిజ్బొల్లా ఉండబోదని ఆయన హెచ్చరించారు.

# రంగంలోకి చైనా!

**రహస్యంగా ఇరాన్‌కు చైనా కార్గో విమానాలు**

- మూడు రోజుల్లో మూడు విమానాలు
- ఇరాన్ సమీపంలో రాడార్‌లో మాయం
- విమానాల్లో ఆయుధాల సరఫరా?

న్యూఢిల్లీ, జూన్ 20: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చిన తరుణంలో అనూహ్య రీతిలో మూడవ పక్షం కూడా నిశ్శబ్దంగా రంగంలోకి ప్రవేశించినట్లు కనపడుతున్నది. చైనాకు చెందిన మూడు బోయింగ్ 747 విమానాలు వరుసగా మూడు రోజులు టెహ్రాన్‌కు చేరుకుని అక్కడే తిష్ఠవేయడం ఇరాన్‌కు చైనా రహస్యంగా సాయం అందచేస్తోందా అన్న ఊహాగానాలు తలెత్తుతున్నాయి. ఇవి సర్వసాధారణంగా వచ్చే విమానాలా లేక ఇరాన్‌కు చైనా రహస్యంగా సైనిక సాయం అందజేస్తోందా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ప్రాంతీయ, రక్షణ మీడియాలోని నిఘా వర్గాలు, విమాన ట్రాకింగ్ డాటా సమాచారం ప్రకారం చైనా నుంచి బయల్దేరిన మూడు బోయింగ్ 747 కార్గో విమానాలు ఇరాన్ చేరుకున్నాయి. మొదటి విమానం ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసిన మరుసటి రోజున శనివారం చైనా నుంచి బయల్దేరింది. రెండో విమానం ఇరాన్ ప్రతీకార దాడులకు సన్నద్ధమవుతుండగా ఆదివారం చేరుకుంది. మూడో విమానం సోమవారం టెహ్రాన్ చేరుకుంది. ఇవి సాధారణ కార్గో విమానాలు కాదు. క్షిపణులు, డ్రోన్లు, తదితర సైన్యానికి సంబంధించిన భారీ ఆయుధాలను రవాణా చేసే సామర్థ్యం గల ప్రత్యేక కార్గో విమానాలు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య సైనిక ఘర్షణలు ఉగ్రరూపం దాలుస్తున్న పరిస్థితులలో ఈ విమానాలు చైనా నుంచి ఇరాన్‌కు చేరడమే పలు అనుమానాలకు దారితీస్తోంది. ఈ మూడు విమానాలు ఒకే మార్గంలో పయనించాయి. ఉత్తర చైనా నుంచి పశ్చిమ దిశగా కజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్ మీదుగా ప్రయాణించి ఇరాన్ సమీపాన రాడార్ నేత్రం నుంచి అదృశ్యమయ్యాయి. లగ్జెంబర్గ్‌కు బయల్దేరినట్లు అధికారికంగా చూపుతున్నప్పటికీ అవి యూరపు సమీపానికి కూడా రాలేదు. ఈ విమానాలు బయల్దేరిన సమయం, వాటి ప్రత్యేకతలు, వాటి గమ్యస్థానం ఇవి సాధారణ రవాణా విమానాలు కాదని సూచిస్తున్నాయి.

**ఇరాన్‌తో చైనా బంధం**

ఇరాన్‌తో చైనాకు సుదీర్ఘకాలంగా బలమైన ఆర్థిక, ఇంధన, సైనిక సంబంధాలు ఉన్నాయి. ఇరాన్ నుంచి చైనా భారీ స్థాయిలో చమురు(ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ) కొనుగోలు చేస్తున్నది. గతంలో తన సైనిక, నిఘా టెక్నాలజీని ఇరాన్‌కు చైనా విక్రయించింది. పశ్చిమాసియాలో అమెరికా ప్రాబల్యాన్ని ఎదుర్కొనే భాగస్వామిగా ఇరాన్‌ను చైనా పరిగణిస్తున్నది. తన చమురు నిక్షేపాలలో 90 శాతానికి పైగా చైనాకే ఇరాన్ ఎగుమతి చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇరాన్ నుంచి వచ్చే ముడి చమురు తక్కువ ధరకు లభిస్తుండడంతో చైనాలోని చమురు శుద్ధి కర్మాగారాలు అధిక లాభాలు ఆర్జిస్తున్నాయి. అమెరికా ఆంక్షల కారణంగా ఇరాన్ నుంచి ముడి చమురు ట్యాంకర్లు అత్యంత రహస్యంగా చైనాకు చేరుకుంటున్నాయి. 2022 నుంచి భారీ రాయితీ ధరలకే ఈ చమురు చైనాకు అందుతున్నది. అయితే ఇరాన్‌కు చైనా సాయపడడం ఇది మొదటిసారి కాదు. గతంలో వేలాది టన్నుల విధ్వంసక క్షిపణి సామగ్రిని ఇరాన్‌కు చైనా పంపించింది. కాగా, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తనను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నట్లు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మంగళవారం ప్రకటించారు. పరిస్థితి మరింత దిగజారకుండా నివారించడానికి అందరూ సాధ్యమైనంత త్వరగా స్పందించాలని ఆయన కోరారు.



## ఇరాన్ అణు పరిశోధనా కేంద్రంపై దాడి

- క్షిపణి విడిభాగాల ఫ్యాక్టరీలపై బాంబులు
- 60కి పైగా ఫైటర్ జెట్లతో ఇజ్రాయెల్ దాడి

*న్యూఢిల్లీ, జూన్ 20: టెహ్రాన్‌లోని డజనుకుపైగా సైనిక స్థావరాలపై గురువారం రాత్రి 60కి పైగా తమ ఫైటర్ జెట్లు దాడి చేశాయని, 120కిపైగా బాంబులను ప్రయోగించాయని ఇజ్రాయెలీ వైమానిక దళం శుక్రవారం వెల్లడించింది. క్షిపణి భాగాలను తయారు చేసే సైనిక పారిశ్రామిక ప్రదేశాలపైన, క్షిపణి ఇంజిన్ల కోసం ఉపయోగించే ముడి పదార్థాలను తయారు చేసే ప్రదేశాలపైన ఫైటర్ జెట్లు దాడి చేసినట్లు ఎక్స్ వేదికగా ఇజ్రాయెల్ వైమానిక దళం తెలిపింది. ఏళ్ల తరబడి వీటిని ఇరాన్ నిర్మించుకుందని, ఇరాన్ రక్షణ శాఖకు, అణు కార్యక్రమానికి ఈ పారిశ్రామిక కేంద్రం అత్యంత కీలకమని తెలిపింది. వీటితోపాటు ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పెంచేందు కోసం అధునాతన ఆయుధాల పరిశోధన, అభివృద్ధి కోసం ఉపయోగించే టెహ్రాన్‌లోని ఎస్‌పీఎన్‌డీ కేంద్ర కార్యాలయంపైన కూడా ఫైటర్ జెట్లు దాడి చేశాయని తెలిపింది. ఇజ్రాయెల్‌పై ప్రయోగించడానికి సిద్ధంగా ఉన్న ఇరాన్‌లోని మూడు క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ వైమానిక దళం పేర్కొంది. వాటిని ప్రయోగించడానికి పనిచేస్తున్న సైనిక కమాండర్‌పై కూడా దాడి జరిగినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాల(ఐడీఎఫ్) ప్రతినిధి తెలిపారు. ఇజ్రాయెల్ సరిహద్దుల్లోకి దూసుకువస్తున్న ఇరాన్ క్షిపణులను విజయవంతంగా నిర్వీర్యం చేస్తున్నట్లు ఐడీఎఫ్ ప్రతినిధి చెప్పారు. ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెలీ ఫైటర్ జెట్లు, వైమానిక దళానికి చెందిన విమానాలు స్వేచ్ఛగా తిరుగుతూ పశ్చిమ, సెంట్రల్ ఇరాన్‌లో ఉన్న సైనిక లక్ష్యాలపై దాడి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇరాన్ గగనతలంపై తమ వైమానిక కార్యకలాపాలను మరింత ముమ్మరం చేస్తూ గగనతల ఆధిపత్యాన్ని సాధిస్తామని ఆయన ప్రకటించారు.*



# ఇజ్రాయెల్‌పై క్లస్టర్ బాంబులు

**మొదటిసారి ప్రయోగించిన ఇరాన్.. జనావాస ప్రాంతాలపై బాంబుల వర్షం**



ఇరాన్ క్షిపణి ధాటికి ఇజ్రాయెల్ బీర్ షెవా టెక్నో పార్కు సమీపంలో చెలరేగుతున్న మంటలు


న్యూఢిల్లీ, జూన్ 20: ఇజ్రాయెల్‌లోని జనావాస ప్రాంతాలపై ఇరాన్ గురువారం క్లస్టర్ బాంబును మోసుకువెళ్లే క్షిపణిని పేల్చింది. 8 రోజులుగా సాగుతున్న యుద్ధంలో ఈ రకమైన బాంబును ఇరాన్ ఉపయోగించడం ఇదే మొదటిసారని ఇజ్రాయెలీ అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్‌లోని జనావాస ప్రాంతాలపైకి దూసుకువచ్చిన ఇరాన్ క్షిపణి డజన్ల కొద్దీ బాంబులను విరజిమ్మి భారీ విధ్వంసం సృష్టించింది. ఇరాన్ పేల్చిన క్షిపణి క్లస్టర్ బాంబుతో ప్రయాణించి భూ ఉపరితలానికి దాదాపు 7 కిలోమీటర్ల ఎత్తులో పేలిపోయి సుమారు 20 ఉప బాంబులుగా విడుదలై 8 కిలోమీటర్ల వ్యాసార్థంలో సెంట్రల్ ఇజ్రాయెల్‌పై దూసుకువచ్చాయని ఇజ్రాయెలీ మీడియా తెలిపింది.

**మైక్రోసాఫ్ట్ సమీపంలో మంటలు**

ఇజ్రాయెల్‌లోని బీర్ షెవా నగరంలో మైక్రోసాఫ్ట్ ఆఫీసుతోసహా అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్న టెక్నో పార్కు సమీపంలో గురువారం పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడినట్లు సీఎన్ఎన్ తెలిపింది. అత్యవసర సర్వీసులు రంగంలోకి దిగాయని పేర్కొంది. అయితే ఇరాన్ క్షిపణిని తాము అడ్డుకుని పేల్చివేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దక్షిణ జిల్లాలోని అనేక ప్రాంతాలపై ఇరాన్ క్షిపణులు దాడి చేసి విధ్వంసం సృష్టించాయని ఇజ్రాయెల్ పోలీసులు తెలిపారు.




విస్తృత వ్యాసార్థంలో విధ్వంసం సృష్టించడం కోసం క్లస్టర్ బాంబును ప్రయోగిస్తారు. ఇది ఓ బాంబుల గుత్తి అని చెప్పవచ్చు. అనేక చిన్న బాంబులను ఇది విడుదల చేస్తుంది. ఒకేసారి పేలుడును సృష్టించకుండా ఈ బాంబు ఎక్కువ ఎత్తు ఉన్న ప్రదేశంలో గాలిలో విస్ఫోటం చెంది అనేక చిన్న బాంబులను విడుదల చేస్తూ విస్తృత వ్యాసార్థంలో లక్ష్యాలపై దాడి చేసి భారీ విధ్వంసాన్ని సృష్టిస్తుంది. క్లస్టర్ బాంబుల ప్రయోగంపై వివాదాలు ఉన్నాయి. వీటిలో కొన్ని బాంబులు పేలకుండా అలాగే క్రియాశీలకంగా ఉండిపోయే అవకాశం ఉంది. ఎవరైనా పొరపాటున వాటిని పట్టుకున్నా, సమీపానికి వెళ్లినా అవి పేలిపోయిన పక్షంలో ప్రాణ నష్టం సంభవిస్తుంది. జనావాసం ఉన్న ప్రాంతాలపై ఈ బాంబును ప్రయోగిస్తే అది సృష్టించే విధ్వంసం అపారమని ఆయుధాల నియంత్రణ సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డెరిల్ కిమ్‌బాల్ తెలిపారు. యుద్ధ సమయాలలో ప్రయోగించిన క్లస్టర్ బాంబులో కొన్ని చిన్న బాంబులు పేలకుండా అలాగే ఉండిపోయి తర్వాత కాలంలో విస్ఫోటం చెందే ప్రమాదం ఎక్కువని ఆయన చెప్పారు.



## ఖతార్ ఎయిర్‌బేస్ నుంచి అమెరికా జెట్స్ మాయం

**ఇరాన్ దాడి భయంతో సురక్షిత ప్రాంతాలకు తరలింపు**

*వాషింగ్టన్, జూన్ 20: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో పశ్చిమాసియా భగ్గుమంటున్న వేళ తాము ఎంతమాత్రం తగ్గేది లేదంటూ ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది. ఖతార్‌లో తమ విమానాలు ఉంచిన అల్ ఉదిద్ ఎయిర్ బేస్ ఇరాన్‌కు సమీపంలో ఉండటంతో దానిపై దాడి చేసే ప్రమాదం ఉందని ఊహించింది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఆ ఎయిర్‌బేస్‌లోని 40 విమానాలను గత రెండు వారాలుగా సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఈ విషయాన్ని జూన్ 5-9 మధ్య ప్లానెట్ ల్యాబ్స్ నుంచి వచ్చిన ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. పశ్చిమాసియాలోని అమెరికా అతి పెద్ద ఎయిర్ బేస్ ఇప్పుడు విమానాలు లేక బోసిపోయి ఖాళీగా కన్పిస్తున్నది. ఉపగ్రహ చిత్రాల ప్రకారం జూన్ 5న సీ-130 హెర్క్యులస్ ట్రాన్స్‌పోర్ట్ విమానాలు, అధునాతన నిఘా జెట్లు ఈ సైట్‌లో పార్క్ చేసి ఉన్నాయి. అయితే జూన్ 19 నాటికి కేవలం మూడు విమానాలు మాత్రమే దర్శనమిచ్చాయి. పబ్లిక్ ఫ్లైట్ ట్రాకింగ్ డాటాను విశ్లేషించిన ఏఎఫ్‌పీ వార్తా సంస్థ జూన్ 15 నుంచి 18 వరకు కేసీ-46ఏ పెగాసస్, కేసీ-135 స్ట్రాటోట్యాంకర్ వంటి కనీసం 27 సైనిక ఇంధనం నింపే మిలిటరీ విమానాలు అమెరికా నుంచి యూరప్‌కు పయనమయ్యాయని తెలిపింది.*


## భారతీయుల కోసం గగనతలాన్ని తెరిచిన ఇరాన్

టెహ్రాన్, జూన్ 20: ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో తమ దేశంలో ఉంటున్న భారతీయ విద్యార్థులు, పౌరులను సురక్షితంగా స్వదేశానికి పంపేందుకు ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధం వల్ల మూసి ఉంచిన ఇరాన్ గగనతలాన్ని భారత విమానాల కోసం తెరచి వారిని మన దేశానికి పంపేందుకు నిర్ణయించింది. ఇరాన్‌లో చిక్కుకుపోయిన మన విద్యార్థులు, పౌరుల కోసం కేంద్రం ఆపరేషన్ సింధూ ప్రారంభించింది. అందులో భాగంగా సుమారు 1000 మందిని మూడు విమానాల ద్వారా భారత్‌కు తీసుకు వస్తున్నారు. అందులో మొదటి విమానం శుక్రవారం రాత్రి 11.30 గంటలకు ఢిల్లీకి చేరుకుంటుందని అధికారులు చెప్పారు. ఇరాన్ నుంచి రావాలనుకున్న మన వారందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



## ఇరాన్‌లో ఇజ్రాయెల్ వ్యతిరేక నిరసనలు

దుబాయ్, జూన్ 20: ఇజ్రాయెల్‌ను వ్యతిరేకిస్తూ వేలాదిమంది ఇరాన్ పౌరులు శుక్రవారం టెహ్రాన్‌తోపాటు ఇతర నగరాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. చేతిలో ఇరాన్ జెండాలను పట్టుకుని, పశ్చిమ దేశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇరానియన్లు నిరసనల్లో పాల్గొన్నారు. వేలాది ప్రజలు రాజధాని టెహ్రాన్ వీధుల్లో నినాదాలు చేస్తూ నడుస్తున్న దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. ఇజ్రాయెల్‌తో ఘర్షణ ప్రారంభమైన తర్వాత మరణించిన ఇరానియన్ కమాండర్ల ఫొటోలను చేతిలో పట్టుకుని కొందరు నిరసనలో పాల్గొన్నారు. ఇరాన్‌ను బలపరుస్తున్న లెబనాన్ ఉగ్రవాద గ్రూపు హిజ్బొల్లా జెండాలను కూడా కొందరు పట్టుకున్నారు. నిరసనకారులు ఇజ్రాయెల్ వ్యతిరేక, బ్రిటిష్ వ్యతిరేక నినాదాలు చేస్తున్న దృశ్యాలను ఇరాన్‌కు చెందిన తస్నీమ్ వార్తా సంస్థ ప్రసారం చేసింది.




## రాఫెల్ పిలుస్తున్నది!

**అమెరికా జెట్లకు పోటీగా మాక్రాన్ పోస్ట్**

న్యూఢిల్లీ, జూన్ 20: 'ఎన్నాళ్లనీ అమెరికాపై ఆధారపడతాం.. ఇకనైనా యూరోపియన్ దేశాలు స్వయం ప్రతిపత్తి వైపు అడుగులు వేద్దాం. అమెరికా జెట్ల వైపు కాకుండా మన యూరప్‌లోనే తయారైన రాఫెల్ విమానాన్ని ప్రోత్సహిద్దాం.. ఆత్మనిర్భర్ యూరప్ సాధిద్దాం' అని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. ఫోన్ స్క్రీన్‌పై 'రాఫెల్ నుంచి కాల్' వస్తున్నట్టు ఉండగా, కింద యూరప్‌ను రక్షించుకుందాం అన్న ఇమేజ్‌ను మాక్రాన్ పోస్ట్ చేశారు. యూరోపియన్ దేశాలు అమెరికన్ ఫైటర్ జెట్లపై ఆధారపడటంపై పునరాలోచించుకోవాలని ఉద్బోధించారు.

## ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా: మోదీ

భువనేశ్వర్, జూన్ 20: వాషింగ్టన్‌ని సందర్శించాలని కోరుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అందచేసిన ఆహ్వానాన్ని తాను తిరస్కరించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వెల్లడించారు. దానికి బదులుగా జగన్నాథ స్వామి కొలువై ఉన్న పవిత్ర భూమి ఒడిశాకు రావాలని తాను నిర్ణయించుకున్నానని ఆయన చెప్పారు. ఒడిశాలో బీజేపీ తొలి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు.

**విశాఖలో యోగా డేలో పాల్గొననున్న ప్రధాని**

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో భారీయెత్తున నిర్వహించే యోగా కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు విస్తరించి ఉన్న 26 కి.మీ పొడవైన కారిడార్‌లో మూడు లక్షల మంది ఒకేసారి యోగా చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



## నా వీర్యదానంతో జన్మించిన 100 మందికి సంపద పంచేస్తా

**టెలిగ్రాం సీఈవో దురోవ్ ప్రకటన**

*న్యూఢిల్లీ: టెలిగ్రాం వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్ సంచలన ప్రకటన చేశారు. ఫ్రాన్సిస్ లీ పాయింట్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తన వీర్య దానంతో జన్మించిన వంద మంది పిల్లలకు సంపదను సమంగా పంచుతానని చెప్పారు. అయితే వారికి 30 ఏండ్లు వచ్చే వరకు మాత్రం సంపదపై హక్కు లభించబోదని స్పష్టం చేశారు. తనకు ముగ్గురు జీవిత భాగస్వాములతో ఆరుగురు పిల్లలు ఉన్నారని తెలిపారు. అయితే పదిహేనేండ్లుగా తాను వీర్యదానం చేస్తున్నట్టు, తద్వారా 100 మంది పిల్లలు పుట్టినట్టు ప్రకటించారు. అయితే వీరందరినీ ఒకేలా చూస్తానని, ఎలాంటి వ్యత్యాసం ఉండదని చెప్పారు. తన సంపదపై వీరందరికీ సమాన హక్కు దక్కుతుందని ప్రకటించారు. అయితే 30 ఏండ్ల వరకు తన సంపద తన పిల్లలు ముట్టుకోకుండా వీలునామా రాసినట్టు తెలిపారు. ప్రస్తుతం పావెల్ దురోవ్ సంపద దాదాపు రూ.1.4 లక్షల కోట్లు.*



## పాక్‌కు చైనా జే-35 స్టెల్త్ ఫైటర్ జెట్స్

**భారత్ వద్ద ఇలాంటి యుద్ధ విమానాల్లేవ్**

*న్యూఢిల్లీ, జూన్ 20: చైనా గత ఏడాది నవంబర్‌లో ఆవిష్కరించిన 40 జే-35 యుద్ధ విమానాలను పాకిస్థాన్‌కు అందించనుంది. అత్యంత వేగంగా పయనించే ఈ ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌లను రాడార్ లేదా సోనార్ వ్యవస్థల ద్వారా కనుగొనడం అత్యంత కష్టతరం. ఇటువంటి విమానాలున్న అతికొద్ది దేశాల సరసన పాక్ చేరింది. భారత్ వద్ద ప్రస్తుతానికి ఇంతటి అధునాతన యుద్ధ విమానాలు లేవు. జే-35 యుద్ధ విమానాలు అమెరికా వద్దనున్న అత్యంత ఖరీదైన ఎఫ్-35తో సమానమని చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్ వార్తా సంస్థ తెలిపింది. రెండు ఇంజిన్లు, ఒకే సీటు ఉండే జే-35లో అత్యంత అధునాతన వ్యవస్థను అమర్చినట్టు పేర్కొంది. ఇంతవరకు ఏ యుద్ధంలోనూ ఈ విమానాన్ని వినియోగించనందున దీని సామర్థ్యంపై ఎటువంటి వివరాలు అందుబాటులో లేవు. ఈ విమానాల కొనుగోలుతో పాక్ గగనతల యుద్ధ తంత్రంలో భారత్‌పై పైచేయిగా ఉండగలదని నిపుణులు పేర్కొంటున్నారు.*

# లంచమిచ్చిన వారికే ఇళ్లు!

- కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మరో భారీ స్కామ్
- పార్టీ ఎమ్మెల్యే పాటిల్ ఆడియో లీక్‌తో బయటపడ్డ అవినీతి
- జాబితా బయటకొస్తే ప్రభుత్వం షేక్ అవుతుందని వ్యాఖ్య





బెంగళూరు, జూన్ 20: కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మరో కుంభకోణం బయటపడింది. రాజీవ్ గాంధీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా పేదలకు కేటాయించిన ఇండ్ల కేటాయింపులో భారీగా అవినీతి చోటుచేసుకుంది. ఈ పథకంలో పెద్దయెత్తున డబ్బులు చేతులు మారాయి. నిజమైన పేదలకు కాకుండా లక్షల రూపాయలు లంచాలు ఇచ్చిన వారికే ఇళ్లను కేటాయించారు. ఎమ్మెల్యేల సిఫార్సులను సైతం బేఖాతరు చేసి అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. స్వయాన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఈ మేరకు మాట్లాడిన ఒక ఆడియో ఇప్పుడు వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారం బయటపడింది. లంచాలు ఇచ్చి అక్రమంగా ఇళ్లు పొందిన వారి జాబితా కనుక బయటకు వస్తే కర్ణాటక ప్రభుత్వం కదిలిపోతుందని పాటిల్ ఆ ఆడియోలో హెచ్చరించారు

**ప్రజాప్రతినిధుల సిఫార్సులూ బేఖాతరు**

హౌసింగ్ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ వ్యక్తిగత సహాయకుడు సర్ఫ్‌రాజ్‌ఖాన్‌తో అలంద్ ఎమ్మెల్యే, కర్ణాటక రాష్ట్ర పాలసీ, ప్రణాళికా కమిషన్ డిప్యూటీ చైర్మన్ కూడా అయిన పాటిల్ మాట్లాడిన ఆడియో లీక్ అయింది. ఈ ఆడియోలో తాను, మిగిలిన ప్రజాప్రతినిధులు సిఫార్సు చేస్తూ ఇచ్చిన లేఖలను సైతం బేఖాతరు చేస్తూ లంచాలు ఇచ్చిన వారికి మాత్రమే ఈ పథకం కింద ఇండ్లను కేటాయించారని పాటిల్ ఆరోపించారు. తాను చేసిన సిఫార్సులను కూడా వారు పక్కన పడేసి లంచాలు ఇచ్చిన గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్లు సిఫార్సు చేసిన వారికి ఇండ్లను కేటాయించారని, ఇదేమన్నా వ్యాపారమా? అని పాటిల్ ఆగ్రహంతో ప్రశ్నించారు. తాను చేసిన సిఫార్సుల కన్నా డబ్బు చెల్లించిన వారికే హౌసింగ్ కార్పొరేషన్ ఎందుకు ప్రాధాన్యం ఇచ్చిందని ఆయన నిలదీశారు. ఇలా జరిగితే ఇక తన గౌరవం ఏముంటుందని ఆయన ఆగ్రహంతో ప్రశ్నించారు. అలా లంచాలు తీసుకున్న వారి జాబితా ఇస్తే వారిని జైలుకు పంపుతానని ఖాన్ పేర్కొన్నారు. ఇళ్లు పొందిన వారి జాబితా కనుక బయటకు వస్తే కర్ణాటక ప్రభుత్వం షేక్ అవుతుందని పాటిల్ హెచ్చరించారు. ఆయన మాట్లాడిన ఈ ఆడియో ఇప్పుడు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నది. అయితే దీనిని తక్కువ చేయడానికి కాంగ్రెస్ నేతలు కిందామీదా పడుతున్నారు.

**లంచాలు లేకుండా ఏ పనీ జరగదు**

దీనిపై బీజేపీ నేత, మాజీ సీఎం యెడియూరప్ప స్పందిస్తూ 'కాంగ్రెస్ ఎమ్మెల్యే పాటిల్ చెప్పింది వందశాతం నిజం. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో లంచం లేకుండా ఏ పనీ జరగదు. ఈ విషయాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యేయే స్వయంగా చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం అంగీకరించి తన తప్పును సరిదిద్దుకోవాలి' అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇళ్ల కేటాయింపుకే కాదు, దేనికైనా లంచం ఇవ్వాల్సిందేనన్న విషయాన్ని స్వయంగా ఎమ్మెల్యే పాటిలే ఒప్పుకున్నారని, నూరు శాతం అవినీతితో నిండిన ప్రభుత్వం ఏదన్నా ఉందంటే అది సిద్ధరామయ్య ప్రభుత్వమేనని బీజేపీ హుబ్లీ ఎమ్మెల్యే మహేశ్ విమర్శించారు.

## ఎస్ఎస్ఎల్‌వీ బిడ్‌ను దక్కించుకున్న హెచ్ఏఎల్

న్యూఢిల్లీ, జూన్ 20: భారత దేశపు చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎస్ఎల్‌వీ) తయారీ బిడ్‌ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) దక్కించుకుందని ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ తెలిపింది. ఈ కాంట్రాక్టు విలువ 511 కోట్ల రూపాయలని తెలిపింది. కాగా ఈ బిడ్డింగ్‌లో హెచ్ఏఎల్ కన్సార్టియంలో భాగంగా కాకుండా సోలోగానే పాల్గొని టెండర్ దక్కించుకుంది.

## పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌లో సర్వర్ సమస్యలు

**రెండు రోజులుగా సేవలకు అంతరాయం**

న్యూఢిల్లీ: పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌లో సర్వర్ సమస్యలు తలెత్తడంతో గురు, శుక్ర వారాల్లో దేశ వ్యాప్తంగా ఉన్న పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో (పీఎస్‌కే) సేవలకు ఆటంకం ఏర్పడింది. దీనిపై ఢిల్లీ, భోపాల్, థాణెల నుంచి పౌరులు పెద్దయెత్తున ఎక్స్‌లో ఫిర్యాదు చేశారు. చివరి నిమిషంలో అపాయింట్‌మెంట్ల రద్దు, జాప్యాలపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. వెబ్‌సైట్, యాప్ సరిగ్గా పనిచేయడం లేదని పలువురు సామాజిక మాధ్యమంలో ఫిర్యాదు చేశారు.